

గొట్లగట్టు..ఆటల్లో అదరగొట్టు

కొనకనమిట్ల మండలం గొట్లగట్టు జెడ్పీ హైస్కూల్ క్రీడాకారులకు, ఆటల పోటీల్లో పతకాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది.

- 8లో..



ప్రజల ఆందోళనతో కదిలిన ఎక్సైజ్ శాఖ

చీమకుర్తి మండలం మంచికలపాడులో బెల్టు షాపులు తొలగించాలని మహిళలు ఆందోళన చేయడంతో ఎక్సైజ్ అధికారులు గ్రామాన్ని సందర్శించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
36 /25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు పడవచ్చు. చలిగాలులు వీస్తాయి

న్యూస్‌రీల్

జిల్లా ఎస్పీగా హర్షవర్ధన్ రాజు



నూతన ఎస్పీ హర్షవర్ధన్ రాజు (ఫైల్)

ఒంగోలు టౌన్: జిల్లా ఎస్పీగా వి.హర్షవర్ధన్ రాజును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన తిరుపతి అర్బన్ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. 2013 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన విజయవాడ డీసీపీగా, సీఐడీ ఎస్పీగా పనిచేశారు. అన్నమయ్య జిల్లా తొలి ఎస్పీగా చేశారు. నెల్లూరు జిల్లా కావలి గ్రామానికి చెందిన హర్షవర్ధన్ జేఎన్‌టీయూసీలో బీటెక్ చేశారు. ఇప్పటి వరకు ఎస్పీగా విధులు నిర్వహించిన ఏఆర్ దామోదర్‌ను విజయనగరం బదిలీ చేశారు.

నవోదయలో ప్రవేశానికి 23 వరకు గడువు పెంపు

ఒంగోలు సిటీ: జవహర్ నవోదయ విద్యాలయంలో 11వ తరగతిలో చేరేందుకు అడ్మిషన్లకు దరఖాస్తు గడువును ఈనెల 23వ తేదీ వరకు పొడిగించారని ప్రిన్సిపల్ సి.శివరాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి చదివిన విద్యార్థులు జవహర్ నవోదయ పాఠశాలలో అడ్మిషన్లు పొందవచ్చన్నారు. ఈ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలంటే పూర్తి వివరాల కోసం జవహర్ నవోదయ విద్యాలయ ఆఫీస్‌లో సంప్రదించాలని, అప్లై చేసుకోవడానికి చివరి తేదీ సెప్టెంబర్ 23 వరకు గడువు పెంచారని తెలిపారు. వివరాలకు 77802 08733 నంబరును సంప్రదించాలని కోరారు.

లోక్ అదాలత్‌లో 6729కు పైగా కేసుల పరిష్కారం



కక్షిదారులను విచారిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి

ఒంగోలు: జిల్లావ్యాప్తంగా 25 బెంచీలలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో శనివారం 6729 కుపైగా కేసులు పరిష్కరించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి తెలిపారు. 167 సివిల్, 6558 క్రిమినల్ వ్యాజ్యాలతోపాటు ప్రీలిటిగేషన్ స్థాయిలో 4 కేసులు పరిష్కరించారన్నారు. మోటారు వాహన ప్రమాద బీమా కేసుల్లో, కొన్ని ఇతర రకాల కేసుల్లో దాదాపుగా రూ.2 కోట్లు పరిష్కారం రూపంలో చెల్లింపులు చేసినట్లు పేర్కొన్నారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం సహకరించిన న్యాయవాదులకు, పోలీసువారికి, వివిధ ప్రభుత్వ శాఖల ప్రతినిధులకు, బ్యాంకు అధికారులకు, బీమా అధికారులకు న్యాయసేవాధికార సంస్థ తరఫున జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎ.భారతి అభినందనలు తెలిపారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి

- జీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్



మాట్లాడుతున్న బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ రమేష్

ఒంగోలు సిటీ: 12వ వేతన సంఘాన్ని నియమించి, 30 శాతం మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలు వీవీపీ రోడ్‌లోని ప్రధానోపాధ్యాయుల భవనంలో బీటీఏ ఒంగోలు జిల్లా కార్యవర్గ సమావేశం వర్కింగ్ ప్రెసిడెంట్ కె.దేవసహాయం అధ్యక్షతన, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మాధవరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తయినా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పల్లె వెంకటరావు మాట్లాడుతూ 11వ పీఆర్సీ, డీఏ, సరెండర్ లీవుల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మాధవరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల మీద యాప్ ల భారం ఎక్కువైందని, దాని వలన బోధన కుంటుపడిందని, ప్రభుత్వం వెంటనే యాప్ ల భారం తగ్గించి బోధనపై దృష్టి పెట్టేలా చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జాలరామయ్య, రాష్ట్ర కార్యదర్శి యం.శరత్ చంద్ర బాబు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జగన్నాథం ప్రసాదరావు, జిల్లా కోశాధికారి గంటనపల్లి శ్రీనివాసులు, జిల్లా ప్రచార కార్యదర్శి పల్లె కృష్ణమూర్తి, జిల్లా నాయకులు గాలిమోటు భాస్కరరావు, బొంత కళ్యాణ్, నూకతోటి కుమార్ స్వామి, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

పత్రికలపై కేసులు పెట్టడం అన్యాయం



ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్న పత్రికలపై రాష్ట్ర ప్రభుత్వం కక్షగట్టి కేసులు నమోదు చేయడం అన్యాయం. ప్రజాస్వామ్యంలో ఇది మంచి సంప్రదాయం కాదు. నచ్చని వార్త వస్తే ఖండన ఇవ్వవచ్చు. అంతే కానీ వరుసగా కేసులు నమోదు చేయడం మంచిపద్ధతి కాదు. ఇటీవల సాక్షి పత్రిక ఎడిటర్, రిపోర్టర్లపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలి.

– అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి



ప్రజాస్వామ్యంలో పత్రికలపై కేసులు సరికాదు



ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రభుత్వాలు చేసే తప్పులు, పొరపాట్లను ప్రజలకు చేరవేయడంలో పత్రికలది ప్రధానపాత్ర. ప్రస్తుత ప్రభుత్వ అవినీతిని, పాలనా వైఫల్యాలను ప్రశ్నిస్తూ ప్రజలకు వాస్తవాలను చేరవేస్తుందనే అక్కసుతో 'సాక్షి' దినపత్రికపై కక్ష సాధింపునకు దిగడం సరైన విధానం కాదు. సాక్షి ఎడిటర్, ఇతర విలేకరులపై అక్రమంగా కేసులు నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలి.

– బుర్రా మధుసూదన్ యాదవ్, కనిగిరి మాజీ ఎమ్మెల్యే

సాగు, తాగు నీరందించే సాగర్ కాలువ అడుగడుగునా ఆక్రమణలకు గురైంది. చాలా ప్రాంతాల్లో కాలువ కుంచించుకుపోవడంతో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. ఫలితంగా రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా సంతనూతలపాడు నియోజకవర్గంలో గ్రానైట్ క్వారీ యాజమాన్యాలు అడ్డగోలుగా ఆక్రమించేస్తున్నాయి. ఇదంతా తెలిసినా ఇరిగేషన్ అధికారులు మాత్రం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఆక్రమణలపై తాజాగా హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతోనైనా అధికారుల్లో చలనం వస్తుందా అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.



కారుమంచి కాలువకట్టపై గ్రానైట్‌రాళ్ళతో వెళ్తున్న ట్రాలీలు(ఫైల్)

సర్వేచేసి తగిన చర్యలు తీసుకుంటాం



సంబంధిత డిపార్టుమెంట్లతో కలిసి సర్వే చేసి ఆక్రమించుకున్న సాగర్ కాలువలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. ఇరిగేషన్‌కు సంబంధించిన సాగర్ కాలువలను ఆక్రమించుకున్న గ్రానైట్ యజమానులను గుర్తించి కాలువలను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకుంటాం.

– డీ.వరలక్ష్మి, ఎస్ఈ, ఇరిగేషన్ డిపార్టుమెంట్, ఒంగోలు

ఆక్రముంచేశారు!

- సాగర్ కాలువ, వాగుల ఆక్రమణలు
- ఒక్క చీమకుర్తి మండలంలో 20 కి.మీ పొడవునా ఆక్రమణలు
- 30 నుంచి 40 గ్రామాలకు సాగు, తాగునీటి సరఫరాకు ఆటంకం
- వెయ్యి ఎకరాలకు పైగా సాగునీటి ప్రవాహాలకు అడ్డుకట్ట
- భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోని అధికారులు
- హైకోర్టు కన్నెర్ర చేయడంతో ఇరిగేషన్, మైన్స్ అధికారుల ఉరుకులు పరుగులు
- 6 వారాల గడువులోపు నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశాలు



తిరుపతమ్మ గుడి యాజమాన్యం ఆక్రమించుకుని పూడ్చేసిన సాగర్ కాలువ



కారుమంచి కాలువ కట్ట విరిగి పక్కనున్న మధుకాన్ గ్రానైట్ క్వారీలో పడిన దృశ్యం(ఫైల్)

చీమకుర్తి:

సాగర్ జలాలు జిల్లాకు ప్రధాన నీటి వనరు. త్రిపురాంతకం వద్ద సాగర్ జలాలు జిల్లాలోకి అడుగిడుతాయి. అక్కడ నుంచి దొనకొండ, కురిచేడు, దర్శి, చీమకుర్తి, సంతనూతలపాడు మీదుగా రామతీర్థం చేరుతాయి. అక్కడ నుంచి ఒంగోలు నగరానికి, కిందన వెయ్యి ఎకరాలకు సాగు నీరు సరఫరా అవుతుంది. ఇంత కీలకంగా ఉన్న కాలువపై అడుగడుగునా అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. ప్రధానంగా చీమకుర్తి మండల పరిధిలో ఉన్న పలు గ్రానైట్ క్వారీ యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ఆక్రమణలకు పాల్పడ్డారు. సంబంధిత అధికారులకు మామూళ్లు ముట్టజెబుతుండడంతో అటువైపు కన్నెత్తి చూడడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ ప్రాపర్టీస్ అండ్ ఎన్విరాన్‌మెంట్ రైట్స్ అనే స్వచ్ఛంద సంస్థ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. దీనిపై హైకోర్టు కన్నెర్ర చేసింది. నాలుగు రోజుల కిందట క్వారీ యజమానులకు నోటీసులు జారీ చేసింది. ఆరు వారాలలోగా సమాధానమివ్వాలని నోటీసుల్లో పేర్కొంది.

ఆక్రమణలు ఇలా..

రామతీర్థం సమీపంలోని నల్లకొండ నుంచి వర్షం నీరు, పైనున్న ఓబీసీ కాలువ నుంచి సాగర్ మేజర్‌లు కర్నూల్‌రోడ్డును దాటుకొని హంస మినరల్స్, జయమినరల్స్, ఎస్‌వీ ఎక్స్‌పోర్ట్‌ల పరిధిలోని దాదాపు 18 ఎకరాల పరిధిలో సాగర్ కాలువలను ఆక్రమించుకోవడం ద్వారా ఆయా కాలువలకు దిగువనున్న బూదవాడ, ఆర్.ఎల్.పురం, మైలవరం, చినరావిపాడు గ్రామాల వైపు సాగరు నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతుంది. హైకోర్టులో పిల్ వేయటంతో ఆ మూడు క్వారీల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కానీ ఆ మూడు క్వారీలకు దిగువనున్న పలు గ్రానైట్ క్వారీల వారు సాగర్ కాలువలతో పాటు వందల ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన సహజ వాగులను ఆక్రమించుకొని డంపింగ్‌లు, గ్రానైట్ క్వారీలు, వేస్ట్ రాళ్లతో ఆక్రమించేయడంతో సాగునీటి ప్రవాహానికి తీవ్రంగా ఆటంకం కలుగుతోంది. బూదవాడ గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్‌లు 106/1,2,3 లలో 10.74 ఎకరాలు, అలాగే సర్వే నంబర్లు 107, 108లో 6.61 ఎకరాలు, ఆర్.ఎల్.పురం గ్రామ పంచాయతీ పరిధిలోని 66/1, 67/1ఏ, 67/2, 67/2బీ, 69/2, 70/2, 70/3 లలో 0.82 ఎకరాలు మొత్తం కలిపి 18.71 ఎకరాల ప్రభుత్వ భూమిలోని సాగర్ కాలువలు, వాగులను ఆక్రమించుకున్నట్లు హైకోర్టులో పిల్‌ను దాఖలు చేశారు. ఇవే కాకుండా రామతీర్థం పరిధిలోని నల్లకొండ నుంచి వచ్చే వర్షపు నీరు, సాగర్ కాలువలలోని వరద వృథా నీరు అంతా కలిసి ఆర్.ఎల్.పురం పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్‌లు 24, 23, 14, 15, 16లలోని రామతీర్థం ఆలయం దేవుడి మాన్యం, పోకర్ణా గ్రానైట్ క్వారీల పరిధిలో నుంచి కర్నూల్ రోడ్డును దాటి బూదవాడ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్‌లు 10, 105, 106, 107, 108, 109 మీదుగా బూదవాడ చెరువు సర్వేనంబర్ 110లోకి వచ్చి చేరుతాయి. ఈ మధ్యలో పోకర్ణా గ్రానైట్ యాజమాన్యం కూడా వాగునీటి ప్రవాహాన్ని అడ్డుకొని ఆక్రమించుకున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. కర్నూలు రోడ్డు దాటిన తర్వాత బూదవాడ చెరువులోకి పోయే ప్రవాహాన్ని జయమినరల్స్, హంస గ్రానైట్ యాజమాన్యం ఆక్రమించుకున్నాయి.

సాగు, తాగునీటి సరఫరాకు ఆటంకం

ఇలా సహజ సిద్ధంగా ప్రవహించే వాగులను, ప్రభుత్వం రైతుల పంటల సాగుకు నీటిని అందించే సాగర్ కాలువలను గ్రానైట్ యజమానులు ఇష్టానుసారంగా ఆక్రమించుకుంటే ఇరిగేషన్ అధికారులకు ఇవేమీ పట్టనట్లుగా చోద్యం చూస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒంగోలు బ్రాంచ్ కెనాల్ నుంచి కారుమంచి కాలువ ద్వారా సుమారు 30-40 గ్రామాలకు సాగు, తాగునీరు సరఫరా అవుతుంది. కూనంనేనివారిపాలెం, గోనుగుంట, మువ్వవారిపాలెం, ఎనికపాడు, మద్దులూరు ద్వారా చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల్లోని పలు గ్రామాలకు కారుమంచి కాలువ ద్వారా 119 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంది. దానిని మధుకాన్ గ్రానైట్ యాజమాన్యం బఫర్ జోన్ నిబంధనలకు తిలోదకాలిచ్చి కారుమంచి కాలువ ఒడ్డు సమీపం వరకు తవ్వుకోవడం వలన కాలువ ఒడ్డు విరిగి మధుకాన్ క్వారీలో పడింది. దాని ఫలితంగా దిగువనున్న 30కు పైగా గ్రామాల పరిధిలో సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీటి కష్టాలు ఏర్పడ్డాయి. ఆయా గ్రామాల ప్రజలు, పశువుల తాగునీటి అవసరాలకు ఉపయోగించే చెరువులకు కారుమంచి నుంచి సక్రమంగా నీటిని అందించటంలో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గ్రానైట్ రాళ్లతో ఇష్టం వచ్చినట్లు పెద్దపెద్ద ట్రాలీలు కారుమంచి కాలువ కట్ట మీద తిరుగుతున్నా మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు అటువైపు కన్నెత్తి చూడడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. చీమకుర్తి ఇరిగేషన్ డివిజన్, సబ్ డివిజన్‌కు సంబంధించిన అధికారులందరూ చీమకుర్తిలోనే ఉంటున్నా వారికేమీ పట్టదన్నట్లుగా వ్యవహరిస్తున్న తీరు స్థానికులను విస్మయానికి గురిచేస్తోంది. హైకోర్టు ఆగ్రహించడంతో ఇరిగేషన్, మైన్స్ అధికారులు ఎలా స్పందిస్తారోనని స్థానికులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

సమన్వయంతో ముందుకెళతా



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజాబాబు

- 39వ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజాబాబు

ఒంగోలు సబర్బన్: ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ జిల్లా సమగ్రంగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటానని కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. ప్రకాశం జిల్లా 39వ కలెక్టరుగా శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ముందుగా కుటుంబ సమేతంగా ఎన్ఎస్‌పీ గెస్ట్‌హౌస్‌కు వచ్చిన కలెక్టరుకు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో బి.చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్ రెడ్డి, ఇతర రెవెన్యూ అధికారులు ఘన స్వాగతం పలికారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దల ఆశీర్వచనాల మధ్య కలెక్టరుగా రాజాబాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ పొలిటికల్ గవర్నెన్స్‌పై ప్రత్యేక దృష్టి పెడతానన్నారు. పరిష్కారం కాని సమస్య అంటూ ఏదీ ఉండదని, ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తానని స్పష్టం చేశారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని చెప్పారు. జిల్లాలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వెలుగొండ ప్రాజెక్టుతో పాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై తాను దృష్టి సారిస్తానని కలెక్టర్ అన్నారు. అనంతరం పలువురు జిల్లా స్థాయి అధికారులు, ఉద్యోగులు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ఆస్ట్రేలియా శనగలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఒంగోలు టౌన్: శనగల దిగుమతులపై ఉన్న 30 శాతం సుంకాన్ని మోదీ ప్రభుత్వం ఎత్తివేయడంతో దేశంలోకి లక్ష టన్నుల శనగలు దిగుమతి అయ్యాయని, దాంతో దేశ రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి చెప్పారు. స్వదేశీ వస్తువులను మాత్రమే కొనుగోలు చేయాలని ఇటీవల ప్రధాని మోదీ ఇచ్చిన మాటకు ఆయనే తూట్లు పొడిచారన్నారు. ఫలితంగా నిన్నటి దాకా క్వింటా శనగలు రూ.10 వేలకు కొనుగోలు చేశారని, ఇప్పుడు కేవలం రూ.6 వేలకు పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మల్లయ్యలింగం భవనంలో శనివారం రైతు సంఘాల సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మన దేశ రైతుల ప్రయోజనాలను గాలికి వదిలేసి కార్పొరేట్లకు లాభాలు తెచ్చేలా దిగుమతి సుంకాలు ఎత్తివేయడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నా రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం ప్రశ్నించలేని దుస్థితిలో ఉందన్నారు. డాక్టర్ స్వామినాథన్ సిఫార్సులకు అనుగుణంగా శనగలు కొనుగోలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటన్నారు. రైతులను ఆదుకుంటామని పత్రికా ప్రకటనలు చేయడమే తప్ప ఆచరణలో అలాంటిదేమీ లేదన్నారు. రైతుల వద్ద ఉన్న పంటలను కొనుగోలు చేసేంత వరకు రైతులకు అండగా నిలిచి పోరాటం చేస్తామన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం శనగ పంటకు బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం శనగ పండించే గ్రామాల్లో ప్రచార కార్యక్రమం నిర్వహించిన మండల కేంద్రాల్లో ఎమ్మార్వోలకు వినతి పత్రాలను అందజేయాలని సమావేశం తీర్మానించింది. సమావేశానికి రైతు నాయకులు వడ్డే హనుమారెడ్డి అధ్యక్షత వహించగా దేవరపల్లి సుబ్బారెడ్డి, బి.సుబ్బారావు, మహేష్, టీవీ శేషయ్య, సీహెచ్ వాసు, ఆంజనేయులు, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.



రైతు సంఘాల సంయుక్త సమావేశంలో మాట్లాడుతున్న కె.వీరారెడ్డి



రంగస్వామి దేవస్థానం వద్ద నీటిగుండంలో దూకుతున్న గుండ్లకమ్మ

నల్లమలలో గుండ్లకమ్మ ఉధృతం

- విరిగిపడిన కొండ చెరియలు

రాచర్ల: గుండ్లకమ్మ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి దర్శనం కోసం వెళ్లిన భక్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షం కారణంగా గుండ్లకమ్మ పరవళ్లు తొక్కుతూ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో శనివారం నెమలిగుండ్ల రంగనాయకస్వామి దర్శనం కోసం వెళ్లిన భక్తులకు నిరాశ ఎదురైంది. భారీ వర్షాలతో గుండ్లకమ్మ వాగు పరిసర ప్రాంతాలతో పాటు దేవస్థానం సమీపంలోని నీటి గుండం వద్ద భక్తులు స్నానాలు చేయకుండా దేవస్థానం సిబ్బంది, పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు.

కొండ చెరియలు విరిగిపడటంతో దర్శనం నిలిపివేత:

ఇటీవల నల్లమల అటవీ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా లక్ష్మమ్మవనం నుంచి నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానం వెళ్లే మార్గంలో శనివారం మధ్యాహ్నం 11:50 గంటల సమయంలో కొండ చెరియలు విరిగిపడి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. ఆ సమయంలో భక్తులు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. మధ్యాహ్నం 12 గంటల నుంచి స్వామి దర్శనం పూర్తిగా నిలిపేసినట్లుగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్య తెలిపారు.



రోడ్డుకు అడ్డంగా పడిన కొండ రాళ్లు

క్లుప్తంగా

పిడుగుపాటుకు 8 గొర్రెలు మృతి



పిడుగుపడి మృతిచెందిన గొర్రెలు

పామూరు: పిడుగుపాటుకు 8 గొర్రెలు మృతి చెందిన సంఘటన పామూరు మండలంలోని రేణిమడుగు గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామంలోని కొనికి రత్తయ్యకు చెందిన గొర్రెలు దొడ్లో ఉండగా పిడుగు పడింది. దీంతో 8 గొర్రెలు మృతిచెందగా, రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని, ఆదుకోవాలని గొర్రెల యజమాని రత్తయ్య కోరారు.

కడలూరు బోట్లకు చుక్కలు

ఒంగోలు, టాస్క్‌ఫోర్స్: నిన్నటిదాకా ఒక లెక్క.. నేడు మరో లెక్క అన్న సినిమా డైలాగులాగా ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాల మత్స్యకారులు శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు సోనాబోటుతో కడలూరు బోట్లను తరమికొట్టి విజయగర్వంతో తిరిగివచ్చారు. కొన్ని సంవత్సరాలుగా తమిళనాడు రాష్ట్రంలోని కడలూరు ప్రాంతానికి చెందిన సోనాబోట్ల కారణంగా ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలోని మత్స్యకారులు ఆర్థికంగా నష్టపోయారు. కడలూరు బోట్ల కారణంగా లక్షలాది రూపాయల విలువ గల వలలు తెగిపోవటంతో పాటు సముద్రంలో మత్స్యసంపదనంతా నిబంధనలకు విరుద్ధంగా వేటాడుతూ దోచుకుపోతున్నారు. ఈ విషయమై జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేకపోవడంతో చివరకు మత్స్యకారులే రంగంలోకి దిగారు. తమ సమస్యను తామే పరిష్కరించుకోవడానికి నడుం బిగించారు. ఆ ప్రకారం రెండు జిల్లాల్లోని మత్స్యకారులు మూడు రోజుల పాటు చేపల వేట నిషేధమని మత్స్యకారపాలెంలో దండోరా వేయించి చేపల వేటను బహిష్కరించారు. శుక్రవారం రాత్రి రెండు జిల్లాలకు చెందిన మత్స్యకారులు సుమారు 80 మంది వరకు హైస్పీడ్ సోనాబోటులో కర్రలు, టపాసులు, ఇతర ఆయుధాలు సమకూర్చుకుని కడలూరు బోట్ల వేట మొదలుపెట్టారు. ఈలోగా సమాచారం అందుకున్న కడలూరు బోట్లు ఈ ప్రాంతంలో వేటాడకుండా కనిపించనంతదూరం వెళ్లిపోయాయి. శుక్రవారం సాయంత్రం కూడా సింగరాయకొండ మండల పరిధిలోని తీరప్రాంతంలో సుమారు 6 సోనాబోట్లు తీరానికి దగ్గరగా చేపల వేట సాగించాయి. మత్స్యకారులు నెల్లూరు జిల్లా పరిధిలోని సోనాబోటు తీసుకుని బాపట్ల జిల్లా చీరాల మండలంలోని ఓడరేవు వరకు వెళ్లారు. కానీ, వారికి ఒక్క సోనాబోటు కూడా కనబడకుండా జారుకున్నాయి. గతంలో చిన్నబోటుతో చేపల వేటకు వెళితే సముద్రంలో 60 నుంచి 80 వరకు సోనాబోట్లు చేపలవేట సాగిస్తూ మత్స్యసంపద కొల్లగొట్టడంతో పాటు లక్షలాది రూపాయల విలువైన వలలు ధ్వంసం చేసేవని, దీంతో ఆర్థికంగా నష్టపోయామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. కానీ, ఇవాళ వారిపై సమిష్టిగా దాడికి వెళితే ఒక్క బోటు కూడా లేదని, అన్నీ పరారయ్యాయని ఆనందం వ్యక్తం చేశారు. సముద్రంలో నిబంధనల ప్రకారం కడలూరు బోట్లు చేపల వేట చేసేంత వరకు ఊరుకునేది లేదని హెచ్చరించారు.

గొట్లగట్టు.. ఆటల్లో అదరగొట్టు..!

- క్రీడా ప్రతిభా అవార్డుల్లో గొట్లగట్టు జెడ్పీ హైస్కూల్‌కు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం
- కబడ్డీ, హ్యాండ్‌బాల్, రెజ్లింగ్, రగ్బీ, సెపక్‌తక్రా, అథ్లెటిక్స్ పోటీల్లో రాణించిన విద్యార్థులు
- రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు సుమారు 60 మంది క్రీడాకారులు



క్రీడాకారులతో వ్యాయామం చేయిస్తున్న పీడీ



కబడ్డీలో పతకం సాధించిన ఉమాశంకర్

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులకు, ఆటల పోటీల్లో పతకాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఆట ఏదైనా పాఠశాల క్రీడాకారులు సత్తాచాటుతూ పతకాలు సాధిస్తున్నారు. సుమారు 60 మంది క్రీడాకారులు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చారు. ఇటీవల నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన క్రీడా ప్రతిభా అవార్డుల ఎంపికలో జిల్లా స్థాయిలో గొట్లగట్టు జెడ్పీ పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచింది. చదువుతో పాటు క్రీడల్లోనూ పాఠశాల విద్యార్థులు సత్తాచాటుతున్నారు. హెచ్‌ఎం, పీడీ, ఉపాధ్యాయులు క్రీడాకారులను గుర్తించి తగిన ప్రోత్సాహాన్ని వారికి అందిస్తుండటంతో ఏ పోటీలకు వెళ్లినా పతకంతో తిరిగి వస్తున్నారు. గతంలో ఈ హైస్కూల్లో పనిచేసిన పీడీ యరగొర్ల బాలగురవయ్య ఇచ్చిన శిక్షణతో కబడ్డీ, హ్యాండ్‌బాల్, రగ్బీ, రెజ్లింగ్, సెపక్‌తక్రా, అథ్లెటిక్స్ పోటీల్లో రాణిస్తూ ఎన్నో పతకాలు సాధించారు. ఆటల పోటీల్లో బాలురే కాదు.. బాలికలు సైతం సత్తాచాటుతూ తామేం తక్కువ కాదని నిరూపించారు.

నిరంతర సాధనతో క్రీడా ప్రతిభా అవార్డుకు ఎంపిక...

గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీడీగా పనిచేసి ప్రస్తుతం మార్కాపురం మండలం పెదనాగులారం జెడ్పీ పాఠశాల పీడీగా పనిచేస్తున్న వై.బాలగురవయ్య ఒకప్పుడు ఈ పాఠశాల పూర్వ విద్యార్థి. పాఠశాలలో చదువుతున్న కొంతమంది క్రీడాకారులను ఎంపిక చేసి వారికి ఆటల పోటీల్లో మెళకువలు నేర్పించారు. క్రీడలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి నిరంతరం సాధన చేయించారు. వారిలో పెండెం నరహరి, మొలకా చిరుత, దుర్బాకుల ఉమాశంకర్, వెన్నా విష్ణువర్ధన్‌రెడ్డి, కోలా ఆకాష్, వరప్రసాద్, దుర్గాప్రసాద్, వెంకటయ్య, నవీన్, యువరాజు, దీప్తి, ఆర్.లక్ష్మీకల్పన, వి.మహేశ్వరి, చంద్రలిఖిత, గురులక్ష్మి, జస్సీలు పలు క్రీడా పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించడంతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు కూడా ఎంపికయ్యారు. అక్కడ కూడా సత్తాచాటి అవార్డులు, పతకాలు దక్కించుకున్నారు. గతేడాది ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలతో పాటు విజయవాడ, తెనాలి, ఒంగోలు, కమలాపురం, బాపట్ల, కావలి, ఏలూరులో నిర్వహించిన జాతీయ, రాష్ట్ర స్థాయి రెజ్లింగ్, కబడ్డీ, రగ్బీ, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు, బ్రాంజ్ మెడల్స్ సాధించారు..

సమన్వయం, సహకారంతోనే పతకాలు...

2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా ప్రకటించిన క్రీడా ప్రతిభా అవార్డుల ఎంపికలో గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం దక్కింది. ఇటీవల ఒంగోలులో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో హెచ్‌ఎం టి.ఆదినారాయణ, పాఠశాల పూర్వ పీడీ యరగొర్ల బాలగురవయ్యను జిల్లా అధికారులు ఘనంగా సన్మానించారు. డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ సోమా సుబ్బారావు, జిల్లా ఉపవిద్యాశాఖ అధికారి చంద్రమౌళేశ్వరరావు, జిల్లా క్రీడా సమైక్య కార్యదర్శి హాజీరాబేగం చేతుల మీదుగా క్రీడా ప్రతిభా అవార్డు, ప్రశంస పత్రం అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఆదినారాయణ మాట్లాడుతూ గొట్లగట్టు జెడ్పీ పాఠశాల క్రీడాకారులు ఆటల పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటడానికి అందరి సమన్వయం, సహకారం ఎంతో తోడ్పడ్డాయని తెలిపారు. అందువలనే తమ పాఠశాల జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఇటీవల బదిలీ అయిన పీడీ బాలగురవయ్య, హెచ్‌ఎం విజయలక్ష్మి సహకారం అభినందనీయమని అన్నారు.



హెచ్‌ఎంను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు



పీడీ, హెచ్‌ఎంలను సన్మానిస్తున్న జిల్లా అధికారులు



గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల

ప్రజల ఆందోళనతో కదిలిన ఎక్సైజ్ శాఖ

- మంచికలపాడును సందర్శించి బెల్టు షాపులు నిర్వహించకుండా చూస్తామన్న ఈఏఎస్ వెంకట్

చీమకుర్తి రూరల్: మండలంలోని మంచికలపాడు గ్రామంలో బెల్టు షాపులు మూసివేయాలని, గ్రామంలో ఎక్కడా మద్యం విక్రయించకూడదని స్థానిక ప్రజలు శుక్రవారం ఆందోళన చేసి రెండు బెల్టు షాపులను ధ్వంసం చేయడంతో ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించారు. శనివారం ఆ గ్రామాన్ని సందర్శించి ప్రజలతో మాట్లాడారు. ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వెంకట్ మాట్లాడుతూ గ్రామ ప్రజల అభీష్టం మేరకు మంచికలపాడులో బెల్టు షాపులు నిర్వహించకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ తమ గ్రామం నుంచి పక్క గ్రామమైన బండ్లమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులు బెల్టు షాపుల వద్ద ఆకతాయిల ఆగడాల కారణంగా భయాందోళన చెందుతున్నారని తెలిపారు. పొలాలకు వెళ్లాలంటే మహిళలు భయపడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అందువలన బెల్టు షాపులను మూసివేయించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పెరికల నాగేశ్వరరావు, ఎంపీటీసీ అత్యాల అంకయ్య, మాజీ సర్పంచ్‌లు శేషమ్మ, శ్రీనివాసరావు, పొన్నపల్లి సుబ్బారావు, అత్యాల ఏసేపు, పొన్నపల్లి ఏడుకొండలు, కోరా సుబ్బారావు, పొన్నపల్లి శ్రీనివాసరావు, పొన్నపల్లి వెంకటరావు, ఉల్లి సుబ్బారావు, సాలువ సుబ్బారావు, చీమకుర్తి ఎక్సైజ్ ఎస్‌ఐ నాగేష్, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



మంచికలపాడు ప్రజలతో మాట్లాడుతున్న ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వెంకట్

ప్రతి విభాగంలో లక్ష్యాలు సాధించాలి

- బాధ్యతలు చేపట్టిన మొదటిరోజే జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ రాజాబాబు



జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు సబర్బన్: ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో సాధించేందుకు కృషి చేయాలని జిల్లా నూతన కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. జిల్లా నూతన కలెక్టర్‌గా శనివారం బా ధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత వివిధ శాఖల అధికారులను పేరుపేరునా పరిచయం చేసుకున్నారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో అమలుచేస్తున్న ప్రాధాన్యతా కార్యక్రమాల వివరాలడిగి తెలుసుకున్నా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు జవాబుదారీగా ముందుకుసాగాలని హితవు పలికారు. నిజాయితీగా, బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. ముఖ్యంగా ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమంలో వివిధ సమస్యలపై వచ్చే అర్జీలను సంబంధిత శాఖల అధికారులు వ్యక్తిగత బాధ్యతగా తీసుకుని జవాబుదారీతనంతో అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని సూచించారు. పరిష్కారం కాని సమస్య అంటూ ఉండదని, ఆ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి సమగ్రంగా పరిశీలన చేసి పరిష్కార మార్గాలు, సమస్య మూలాలు తెలుసుకుని శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శాఖల వారీగా వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు అధికారులు వివరించారు. సమీక్ష సమావేశంలో జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో బి.చినఓబులేసు, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధిపై అవగాహన పెంచాలి

పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధిపై పశుపోషకుల్లో అవగాహన కల్పించాలని నూతన కలెక్టర్ రాజాబాబు సూచించారు. ప్రకాశం భవన్‌లోని తన చాంబర్‌లో పశుసంవర్ధకశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి.రవికుమార్‌తో కలిసి గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమ పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 15 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సుమారు 6,02,250 డోసులు ఉచితంగా వేయనున్నట్లు డాక్టర్ బి.రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యులు డి.సురేంద్రప్రసాద్, పారా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలి

- 5కే రన్‌ను ప్రారంభించిన డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు



5కే రన్‌ను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు

ఒంగోలు టౌన్: ఎయిడ్స్ నియంత్రణపై యువత సరైన అవగాహన పెంచుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం నగరంలోని ప్రకాశం భవన్ నుంచి ప్రగతి నగర్ మీదుగా పాత రిమ్స్ వరకు నిర్వహించిన 5కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్, మాదక ద్రవ్యాల నివారణ గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. ఎయిడ్స్ బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తపడాలని చెప్పారు. ఒకవేళ ఎవరికైనా ఎయిడ్స్ సోకినప్పటికీ ఆందోళన చెందకుండా వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని చెప్పారు. జిల్లా లెప్రసీ అధికారి శ్రీవాణి మాట్లాడుతూ ఎయిడ్స్, హెచ్‌ఐవీపై ఏవైనా సందేహాలుంటే 1097 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. జిల్లా స్పోర్ట్స్ అధికారి రాజరాజేశ్వరి మాట్లాడుతూ యువత చెడు వ్యసనాల బారిన పడకుండా చక్కటి ఆలోచనలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం హెచ్‌ఐవీ, ఎయిడ్స్, మాదక ద్రవ్యాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందించారు. బాలుర విభాగంలో సంతోష్, ఎల్.నాని, బాలికల విభాగంలో ఐశ్వర్య, రమ్య జాయ్‌లకు ప్రథమ, ద్వితీయ బహుమతులుగా ఒక్కొక్కరికి రూ.10 వేలు, రూ.7 వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ పందింటి కిరణ్, సీఎస్‌ఓ సాయి, చంద్రమోహన్, గ్రో ఎన్జీఓ మేనేజర్ పీర్ బాషా, సినార్డ్ మేనేజర్ వెంకటేశ్వర్లు, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ ప్రోగ్రామ్ జిల్లా వనరుల అధికారి జి.స్వరూప్ కుమార్, షేర్ ఇండియా పీఓ అమీన్, డాప్కులేట్ రమేష్, పీపీఎన్ నెట్వర్క్ ప్రతినిధి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి రెవెన్యూలో నయా భూ మాయ..!

- నాన్‌రిఫండబుల్ ఒప్పందంతో ఆన్‌లైన్ అక్రమాలు
- చల్లగిరిగిల్లకు చెందిన 25 ఎకరాల భూమికి ఆన్‌లైన్‌లో పేర్ల మార్పు
- లోకేష్ టీం వ్యక్తి ఫోన్‌తో తిరిగి పేర్ల తొలగింపు
- రెవెన్యూ కీలక అధికారి అక్రమాలపై కలెక్టర్‌కు పలువురి ఫిర్యాదు
- అధికారం అండతో ఇన్‌చార్జిగా కొనసాగుతున్న వైనం?



కనిగిరి తహసీల్దార్ కార్యాలయం

కనిగిరి రూరల్: కనిగిరి రెవెన్యూ కార్యాలయంలో భూ మాయాజాలం జరుగుతోంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే కొందరు వీఆర్వోలను ఇటీవల ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఒకరిద్దరు రెవెన్యూ అధికారులను సస్పెండ్ కూడా చేశారు. అయినా అధికార పార్టీ నేత అండతో ఇన్‌చార్జిగా వచ్చిన ఓ రెవెన్యూ కీలక అధికారి భూముల ఆన్‌లైన్ అక్రమాలకు తెరలేపి జోరుగా దోచుకుంటున్నాడు. రెవెన్యూ వ్యవస్థపై పట్టు, అవగాహన లేని ముదాంలనుంచి పదోన్నతిపై వీఆర్వోలుగా వచ్చిన వారిని మండలంలో చేర్చుకుని వారికి చిల్లర నజరానాలిస్తూ.. తాను భారీ మొత్తంలో దోచుకుంటూ రెవెన్యూ అక్రమాలకు పాల్పడుతున్నాడు. నాన్ రిఫండబుల్ ఒప్పందంతో భూ వెబ్‌ల్యాండ్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో పేర్ల మార్పు, వారసత్వ ధ్రువీకరణ హక్కు పత్రాలు, పొజిషన్ సర్టిఫికెట్ల మంజూరు వంటి అనేక అక్రమాలకు పాల్పడి లక్షలు దోచుకుంటున్నాడనే ఆరోపణలున్నాయి.

రాత్రికిరాత్రే ఆన్‌లైన్‌లో పేర్ల మార్పు...

కనిగిరి తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు అమ్యామ్యాలు తీసుకుని రాత్రికి రాత్రే ఆన్‌లైన్‌లో భూ హక్కుదారుల పేర్లు మార్పుచేయడం, అవసరమైతే తొలగించి ఇతరుల కింద పెట్టడం, కొత్త పేర్లు ఎక్కించడం వంటి ప్రక్రియ జోరుగా సాగుతోంది. అందుకు భూమి విలువను బట్టి వీఆర్వోలు, అవసరమైతే నేరుగా కీలక రెవెన్యూ అధికారే డీల్ కుదుర్చుకుంటున్నాడు. అందిన సమాచారం మేరకు.. కనిగిరి మండలం చల్లగిరిగిల్ల రెవెన్యూ పరిధిలోని రెండు సర్వే నంబర్లకు సంబంధించి 20 ఎకరాల్లో సుమారు 15 మంది రైతులు సాగులో ఉన్నారు. ఆ రైతులు గతంలో ఆ భూమిని కొనుగోలు చేసినట్లు తెలిసింది. అయితే, ఆ భూమిని సుమారు 25 ఏళ్ల క్రితం అమ్మిన వ్యక్తుల పేర్లు ఇంకా ఆర్‌ఎస్‌ఆర్‌లో ఉన్నట్లు సమాచారం. దీన్ని ఆసరాగా చేసుకుని చల్లగిరిగిల్ల రెవెన్యూ పరిధిలో టుబాకో బోర్డు వెనుక గల సుమారు 25 ఎకరాలు, 2 సర్వే నంబర్లకు చెందిన 9 ఎకరాలు, 16 ఎకరాల భూమిని ఐదుగురి పేర్లతో ఆన్‌లైన్ చేశారు. ఈ అక్రమ తంతులో సుమారు రూ.25 లక్షలు చేతులు మారినట్లు ప్రచారం జరుగుతోంది.

గుప్పుమన్నదిలా...

సుమారు 20 రోజుల క్రితం జరిగిన ఈ అక్రమ ఆన్‌లైన్ తంతు విషయాన్ని నాలుగు రోజుల క్రితం రైతులు పసిగట్టారు. వెంటనే రెవెన్యూ కార్యాలయంలోని కీలక అధికారిని ప్రశ్నించారు. తగురీతిలో స్పందన లేకపోవడంతో గతంలో లోకేష్ టీంలో పనిచేసి ప్రస్తుతం సీఎంఓలో ఉంటూ ఓ ఎమ్మెల్యేకు పీఏగా వ్యవహరిస్తున్న కనిగిరి మండలానికి చెందిన వ్యక్తి నేరుగా కనిగిరి రెవెన్యూ కీలక అధికారికి ఫోన్ చేసి గట్టిగా మాట్లాడినట్లు తెలిసింది. దీంతో కంగుతిన్న ఆ కీలక అధికారి రాత్రికి రాత్రి తిరిగి వెబ్‌ల్యాండ్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో ఎక్కించిన పేర్లను తొలగించినట్లు సమాచారం. అంతేగాకుండా చల్లగిరిగిల్లకు చెందిన కొందరి వ్యక్తుల పేర్లను ఒక సర్వే నంబర్లో రాత్రికి రాత్రి ఎక్కించి, మరో నంబర్లో ఇంకొందరి పేర్లు ఎక్కించనున్నట్లు తెలిసింది. ఇవి కాకుండా ఇటీవల కలగట్ల రూట్‌లో ఓ యువ న్యాయవాదికి సంబంధించిన భూమిని కూడా మరొకరి పేరుపై ఆన్‌లైన్ చేసినట్లు, పేరంగుడిపల్లికి చెందిన ఓ కళాశాలకు చెందిన వ్యక్తి భూమిని మరొకరి పేరుపై ఆన్‌లైన్ చేసినట్లు, పునుగోడు రెవెన్యూ పరిధిలోని కొందరి భూములను అక్రమంగా మరికొందరి పేర్లపై ఆన్‌లైన్ చేసినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. దీంతో కొందరు బాధితులు నేరుగా రెండ్రోజుల క్రితం గత కలెక్టర్ తమీమ్ అన్సారియాకు, జేసీకి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

నాన్‌రిఫండబుల్ ప్రక్రియపై పెద్ద ఎత్తున చర్చ...

భూముల రేటును బట్టి మాకు రేటు కడితే ఏమైనా చేస్తామని రెవెన్యూ కీలక అధికారి నేరుగా దందా చేస్తున్నట్లు సమాచారం. ఆన్‌లైన్ నమోదు, పేర్ల మార్పిడి, వారసత్వపు భూములు ఆన్‌లైన్ చేయడం.. ఇలా ఒక్కోదానికి ఒక్కోరేటు పెట్టినట్లు తెలిసింది. ఎక్కడైనా భూముల వివాదాలపై ఫిర్యాదులొస్తే అక్కడికి తన సిబ్బందిని పంపించడం, వివాదంలో అధికార పార్టీ నేతల ప్రమేయం ఉంటే ఓ రేటు.. లేకపోతే మరో రేటు నిర్ణయించడం, కింది స్థాయి అధికారులతో బేరం సాగించడం చేస్తున్నట్లు తెలిసింది. ఇటీవల బల్లిపల్లిలో పంచాయతీలో ఓ రహదారి విషయం తమకు న్యాయం జరగడం లేదని బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో కీలక అధికారి నాన్‌రిఫండబుల్ విధానం పాటిస్తూ.. అందుకు ఇష్టపడిన వారితోనే దందా సాగించడం గమనార్హం. మీకు కావాల్సింది నేను చేస్తా.. అధికార పార్టీ నుంచి వత్తిడి వచ్చినా.. పైఅధికారులు విచారణ చేసినా.. ఏదైనా ఇబ్బంది కలిగితే వెంటనే రద్దు చేస్తా.. ఆన్‌లైన్ నుంచి పేర్లు కూడా తొలగిస్తా.. అయితే, మీరు ఇచ్చిన నగదును రిటన్ చేయను.. దానికి ఇష్టపడితేనే పనిచేస్తా.. అంటూ ముందే ఒప్పందం కుదుర్చుకోవడంతో బాధితులు బయటకు చెప్పుకోలేని దుస్థితి నెలకొంది. ఈ నాన్‌రిఫండబుల్ ప్రక్రియపై స్థానికంగా పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది.

వీఆర్వోకు రూపాయి.. కీలక అధికారికి వంద..!

కనిగిరి మున్సిపాలిటీతో పాటు మండలంలోని 15 పంచాయతీలకు సుమారు 32 (అర్బన్ 12, రూరల్ 20) మంది వీఆర్వోలు ఉన్నారు. 16 మంది మాత్రమే వీఆర్వోలు ఉన్నారు. మిగతా రెవెన్యూ విలేజ్ అంతటికి ఇన్‌చార్జిలే. అందులో నేరుగా వీఆర్వోలుగా వచ్చిన వారు 5 లేదా 6 మంది మాత్రమే ఉండగా.. మిగతా వారంతా ముదాంలుగా ఉండి పదోన్నతులు పొందిన వారే కావడం విశేషం. వీరికి సరైన అవగాహన ఉండకపోవడంతో ప్రధాన రెవెన్యూ గ్రామాల్లో వీరిని ఇన్‌చార్జిలుగా పెట్టుకుని కీలక అధికారి కనుసన్నల్లో నడిపిస్తూ జోరుగా అక్రమ దందా చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.